మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**వనపర్తి ప్రతినిధి మే 3 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినందన అదనంగా 380 బ్యాలెట్ యూనిట్లు ర్యాం డమైజేషన్ పూర్తి చేసి వనపర్తి సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తున్నట్లు జిల్లా ఎన్ని కల అధికారి తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ని ఈ.వి.యం గోదాం నుండి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్లను క్లోజడ్ కంటైనర్‌లో పోలీస్ భద్రతతో చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంకు తరలించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో అదనపు బ్యాలెట్ యూనిట్లు పెట్టవలసిన అవసరం ఏర్పడిందని తెలిపారు. జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి యం.నగేష్, తహసిల్దార్ రమేష్‌రెడ్డి, భాజపా ప్రతినిధులు శంకర్, బీఆర్ఎస్ ప్రతినిధి జమీల్ తదితరులు ఉన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్



బ్యాలెట్ ఓటును వినియోగించుకొంటున్న ఉద్యోగులు, ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి మే3 ప్రభాతవార్త:** పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ప్రెసైడింగ్ అధికారులను ఆదేశించారు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గద్వాల సెగ్మెంట్, డిపిఆర్ఓ కార్యాలయంలో అలంపూర్ సెగ్మెంట్ ల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను, ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం నుండి మే 8 వరకు నిర్వహించు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఓటింగ్ సరళి పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ సజవుగా, సాఫీగా జరిగేలా జాగ్రత్తగా నిర్వహించాలని ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేవ్వర్లు, ఆర్డిఓ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడికాయల గొడవ ప్రాణం మీదికి తెచ్చింది

### గొడ్డలితో నరికి హత్య చేసిన దుండగుడు



గొడ్డలితో నరకడంతో రక్తపు మడుగుతో మృతిచెందిన మల్లాజీ

**లింగాల, మే 03 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన అతి నారి మల్లాజీ (40) అనేవ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం పట్టపగలే చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. మృతుడి అన్న చెన్నంపల్లి, ఎర్రపెంట వెళ్లే మార్గ మధ్యలో ఉన్న మామిడి తోటను కొల్లాపూర్‌కు చెందిన వ్యక్తికి లీజుకు ఇచ్చాడు. కాగా తోటలకు కొంత దూరంలో చెన్నంపల్లికి చెందిన ఓ వ్యక్తి మేకల మందను ఉంచుకోవడానికి చిన్నపాటి గుడారం ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గుడారం వేసిన వ్యక్తి తరచుగా తోటలోని మామిడి కాయలను తెంచడం మృతుడు గమనించాడు. తరచుగా కాయలను తెంచడం గురించి వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా శుక్రవారం మృతుడు ద్విచక్ర వాహనంపై తోటకు లీజుకు తీసుకున్న వ్యక్తిని తోటదగ్గర వదిలి తిరిగి వస్తున్న క్రమంలో మరోసారి మృతుడు ఆ వ్యక్తికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మృతుడు తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ఆ వ్యక్తి తన చేతిలో ఉన్న గొడ్డలితో వెనకనుంచి తలపై బలంగా నరకడంతో మల్లాజీ అక్కడే రక్తపు మడుగులో కుప్పకూలిపోయాడు. మృతుని భార్య మమత కుటుంబ కలహాల మధ్య గతకొన్ని నెలల నుంచి తల్లి స్వగ్రామమైన తెల్కపల్లి మండలం రాయిపాకులలో ఉంటుంది. మృతుని భార్యతోపాటు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. సంఘటన స్థలాన్ని అచ్చంపేట సిఐ రవిందర్, సిఐ జగన్‌మోహన్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సిఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**లింగాల, మే 03 ప్రభాతవార్త:** మండ పరిధిలోని పార్వతీదేవి సమీపంలో రోడ్డు ప్రమాదం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా లింగాల నుంచి అచ్చంపేట వైపు ఓపెన్ టాప్ జీపు పార్వతదేవి మిట్ట సమీపంలో విద్యుత్ స్థంభానికి ఢీకొట్టింది. దీంతో రాజు డ్రైవర్ కాలు విరగగా, ఒకరికి గాయాలయ్యాయి. వీరికి ప్రథమ చికిత్స అందిస్తున్నారు.

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను నిలదీయాలి

### తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

**బిజినేపల్లి, మే 03 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశంలో ప్రజల మధ్య ఐక్యతను కాపాడుకుందామని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటి చేపట్టిన ప్రచార కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రానికి చేరింది. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ కేంద్రంలో గత పదేళ్ల మోడీ ప్రభుత్వ పాలన గురించి కూడా తెలంగాణ ప్రజలు లోతైన అవగాహన ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వానికి మూడోసారి అధికారం ఇవ్వాలని కోరుతూ ప్రజల ముందుకు వస్తున్న బిజెపి నాయకులను కేంద్రంలో వారి పాలనా వైఫల్యాలపై ప్రశ్నించాలన్నారు. గత పదేళ్ల పాలనలో మోడీ ప్రజలకు ఏమి చేశారో చెప్పకుండా, హిందూ, ముస్లిం ప్రజల మధ్య, విద్వేషాలు పెంచే రాజకీయాలు ఎందుకు చేస్తున్నారో నిలదీయాలన్నారు. దళితులు, మత మైనార్టీలు, మహిళల పట్ల వారి సిద్ధాంతం, ఆచరణలో నిండి ఉన్న వివక్షపూరిత ఆధిపత్య ధోరణులను కూడా ప్రజలు ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో గత పదేళ్ల తప్పుడు పాలనకు, ప్రజల కష్టాలకు కారణమైన బిఆర్ఎస్ పార్టీ, తాను చేసిన తప్పుల పట్ల ఏ మాత్రం ఆత్మవిమర్శ లేకుండా, జరిగిన నేరాలకు ప్రజలకు సంజాయిషీ చెప్పకుండా, లోక్‌సభ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మళ్లీ ప్రచార సభలు నిర్వహించడం విడ్డూరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో సాగించిన నేరాలు, అవినీతి, రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో దించిన ఆర్థిక అరాచకత్వం గురించి అర్థం చేసుకుని బిఆర్ఎస్ పార్టీని లోక్‌సభ ఎన్నికలలో కూడా ప్రజలు తప్పకుండా ఓడిస్తారని చెప్పారు. 2014 బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలు చెల్లిస్తామని హామీఇచ్చి గత పదేళ్లుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పంటల భీమా పథకంలో ప్రైవేట్ కంపెనీలను తీసుకువచ్చి వారికి లాభాలు దోచిపెట్టిన మోడీ ప్రభుత్వం, ఎక్కువ మంది రైతులను పంటల భీమా పథకంలోకి ఎందుకు తీసుకురాలేక పోయారని విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంవత్సరానికి 2,72,000 కోట్లు కావాల్సి ఉండగా, ఎందుకు కేంద్ర ప్రభుత్వం 73,000 కోట్లు మాత్రమే కేటాయించింది అన్నారు. మోడీ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వమని రుజువు చేస్తూ ఎలక్టోరల్ బాండ్స్ చట్ట సవరణను సుప్రీంకోర్టు కొట్టివేసినా, మోడీ ప్రభుత్వం ఆ చట్టాన్ని ఎందుకు సమర్థించుకుంటున్నది అని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలను నిలదీయాలని ఓటుహక్కును చైతన్యంతో వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో టిపీజేఏసీ నాయకులు ముత్తయ్య, రామగిరి ప్రకాష్, విజేందర్, శ్రీదేవి, ఖలీల్, యాదయ్య, సత్యనారాయణ, గట్టన్న, లక్ష్మినారాయణ, మస్కూరి శంకర్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

# మతోన్మాద బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టుల లక్ష్యం

● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 03 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ పార్టీతో కూటమిని చిత్తుగా ఓడించడమే కమ్యూనిస్టుల ముందున్న ఏకైక లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీపీఐ లక్ష్మణాచారి భవన్‌లో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ, ఎమ్మెల్సీ కూచిపూడి దామోదర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మోడీ గత 10 సంవత్సరాల్లో భారతదేశాన్ని 30 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లారని, కొత్తగా అభివృద్ధి చేయకపోగా అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న అభివృద్ధి ఫలాలు ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని ప్రైవేటు రంగానికి అప్పనంగా అప్పగించారని వారు విమర్శించారు. రాజస్థాన్ ఎన్నికల సభలో మోడీ మాట్లాడుతూ దేశంలో ప్రతిపక్ష పార్టీలు ముఖ్యంగా కాంగ్రెస్ మెనిఫెస్టులో రాసుకున్నట్లుగా దేశంలో ఉన్న మెజార్టీ హిందువుల సంపదను దోచి మైనార్టీలైన ముస్లింలకు అందిస్తారని, మంగళ సూత్రాలను సైతం లాక్కొని ముస్లిం మైనార్టీలకు పంచుతారని బాధ్యత రహితంగా ప్రధాని మోడీ ప్రకటన చేశారని, నిజానికి దేశంలో 10 సంవత్సరాల కాలంలో పుస్తెలతాడు లాక్కున్న వ్యక్తి ఎవరైన ఉన్నారంటే అది మోడీయేనన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే మతోన్మాద ఉన్మాదులను రెచ్చగొట్టి అనేక మంది మృత్యువాత పడటానికి నోట్లు రద్దు చేసి దాదాపుగా 100 మందికి పైగా మృత్యువుకి కారణమయ్యారని దుయ్యబట్టారు. ప్రణాళిక బద్దమైన ఆలోచన విధానం లేకుండా లాక్‌డౌన్ ప్రకటించి కోట్లాది మంది పేదలు ఉన్న మన దేశంలో వాళ్ల ఆకలి చావులకు కారణమయ్యాడరాన్నరు. నియంతృత్వ రైతు చట్టాలను తీసుకొచ్చి దాదాపు ఒక సంవత్సరం పాటు రైతులు పోరాటం చేస్తే ఆ పోరాటంలో దాదాపుగా 400 మంది రైతులు అసువులు బాశారని, ఇలాంటి హుదాంతాలన్ని మోడీ హయంలోనే జరిగాయని గుర్తు చేశారు. మోడీ లాంటి వ్యక్తి మరోసారి దేశ ప్రధాని అయితే దేశంలో ప్రజాస్వామ్య లౌకికతత్వం పౌర హక్కులు, ప్రజా హక్కులు ప్రజాస్వామ్యం అనేది కనబడదు కాబట్టి దేశ ప్రజలందరు ఏకమై దేశానికి పట్టిన చీడ బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ, కేంద్రంలో బీజేపీ పార్టీలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, అందుకే గత ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఓడించిన ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీని కూడా గద్దె దించి తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థ కమ్యూనిస్టులు నేడు కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో సంపూర్ణమైన మద్దతు ప్రకటించి ఇండియా కూటమి అభ్యర్థి మల్లురవిని గెలిపించానికి ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని, రాబోవు రోజుల్లో ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం వచ్చిన వాళ్లతో సంప్రదింపులు చేసి అందరిని కలుపుకొని పాలన కొనసాగిస్తామని, వారి గౌరవానికి ఎక్కడ భంగం కలగనివ్వమన్నారు. కార్యక్రమంలో పలువురు కమ్యూనిస్టు నాయకులు శివకుమార్, జంగయ్య, రవీంద్రాచారి, ఆనంద్, ఫయాజ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 03 ప్రభాతవార్త:** పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయ పార్టీలన్ని ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లతో, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలు, సి విజిల్ యాప్, సువిధ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు హోం ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. దీనిలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో హోం ఓటింగ్ ఓటర్లు మొత్తం 546 మంది, వీరిలో సీనియర్ సిటీజన్స్ 228, దివ్యాంగులు 259 మంది, అత్యవసర సేవలకు సంబంధించిన ఓటర్లు 59 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియను చేపట్టడానికి 33 రూట్లను ప్రేమ్ చేసినట్లు 22 బృందాలు హోం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్ కోసం ధరఖాస్తు చేసుకొని అర్హత పొందిన ఓటర్లు వారికి సూచించబడిన తేదీల్లో ఇంటి వద్ద అందుబాటులో ఉంటూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, హోం ఓటింగ్ కోసం ఇంటి వద్దకు వచ్చే బృందాలకు సహకరించాలని కోరారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 546 ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సాధారణ ఎన్నికలు 2024 నియమావళి ప్రకారం రాజకీయ పార్టీలు, సభలు అనుమతులకు ఇతర కార్యకలాపాల కోసం వచ్చే ధరఖాస్తులను ఎన్నికల నియమాలు లోబడి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధర ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలపోస్టర్లు, ప్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ మరియు ప్రచురణ కర్తలు, ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127 ఏ ప్రకారం నిబంధనలను పాటించాలన్నారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు, జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన ధర ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బు, మద్యం పంపిణీపై ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ తనిఖీలు పకడ్బందిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క లావాదేవీలపై తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సువిధ పోర్టల్‌లో నమోదుపై రాజకీయ పార్టీల వారికీ అవగాహన కల్పించామని, ఎంసీసీ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లలో నమోదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## మోడీని సాగనంపాలి.. బిజెపికి భవిష్యత్తు లేదు

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ● ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరిలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 03 ప్రభాతవార్త:** గత అసెంబ్లీ ఎన్నికల్లో దొరల పాటనను సాగనంపినట్లే కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సారథ్యంలో జనరంజకంగా పాలన కొనసాగుతోందని గత పది సంవత్సరాల పాలన అంతా అతలాకుతలమై అని ఆయన మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేయడమంటే మన రేవంత్‌రెడ్డికి బలం చేకూర్చినట్లే అని ఆయన చెప్పారు. కేంద్రంలోని నరెంద్రమోడీ ప్రభుత్వం సామాన్య ప్రజల స్థితిగతులను నాశనం చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అయితేనే ప్రజలకు మేలు చేస్తుందని ప్రజల కష్టాల్లో భాగం పంచుకుంటోంది. ఎంతటి కష్టమైనా తొలగించే బలం కాంగ్రెస్‌పార్టీకి ఉంటుందని అందుకే ఆ బలాన్ని పెంచేందుకు మనమంతా కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఐదు నెలల్లోనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రాంతాల్లో 10 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు అన్ని అనుమతులతో పట్టాలెక్కబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా 4 వేల కోట్ల అభివృద్ధికి అన్ని రకాల అనుమతులు తీసుకురావడం జరిగిందని ఆయన చెప్పారు. కానీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు 6 గ్యారంటీలలోఇప్పటికే 5 గ్యారంటీలను అమలు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, సిజె బెనహర్, జిల్లా మైనార్టీ సెల్ ఛైర్మన్ ఫయాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## దివ్యాంగులకు, వయోవృద్ధులకు హోమ్ ఓటింగ్

**వనపర్తి ప్రతినిధి3 ప్రభాతవార్త :** పార్లమెంటు ఎన్నికల్లోనూ హోమ్ ఓటింగ్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్ళలేని వారికి ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హోమ్ ఓటింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ మోమ్ ఓటింగ్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలో మే 3వ తేదీ నుండి హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అయింది. శుక్రవారం నుండి ప్రారంభమైన ప్రక్రియ మే 8వతేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. హోమ్ ఓటింగ్ కు మొత్తం 269 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి సజావుగా ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ మొత్తం 8 పోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి హోమ్ ఓటింగ్ కలిగి ఉన్న 7 మండలాల్లో ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి ఓటు వేయించే విధంగా రోజు వారి రూట్ మ్యాప్ లను సిద్ధం చేయించారు. మే 3 నుండి 8 వరకు హోమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇంటి వద్దను ఓటు వేసినందుకు చాలా సంతోషంగా ఉంది ఎన్నికల కమిషన్ కు ధన్యవాదాలు మాధవి (దివ్యాంగురాలు) ఓటింగ్‌లో పాల్గొన్న ఎన్నికల సిబ్బంది శుక్రవారం ఉదయం వనపర్తి పట్టణంలోని గాంధీనగర్ వార్డు నెంబర్ 18లో నివాసముంటున్న మాధవి భర్త పేరు శివాజీ దివ్యాంగురాలు హోమ్ ఓటింగ్ సిబ్బంది తన ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయించుకొని పోవడం పై సంతోషాన్ని వెలిబుచ్చారు. తాను నడవలేని కనీసం కుర్చీలో సైతం కుర్చోలేనని అన్నారు. నాకు ఓటు ఉన్నా ఓటు వేయాలని బాధ పడేదనీ కానీ ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగం చొరవతో శుక్రవారం నాకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేశానని సంతోషం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనేది తన అభిమతమని పేర్కొన్నారు.



హోమ్ ఓటింగ్‌లో పాల్గోన్న ఎన్నికల సిబ్బంది, ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగురాలు

### ప్రజాపాలన చూసి పార్టీలోకి వలసలు : ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట, మే 03 ప్రభాతవార్త :** అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్మి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దమగ్నాపూర్‌లోని తన స్వగృహంలో లాలకోట, బండర్‌పల్లి, పర్దీపూర్ గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన లాల్‌కోట మాజీ సర్పంచ్ కురువ శ్రీనివాసులు, పర్దీపూర్ మాజీ ఎంపిటిసి కురువశంకర్, మాజీ సర్పంచ్‌లు కురువ భాస్కర్, కావలి కృష్ణయ్యతో పాటు నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి, విండో ఛైర్మన్ సురెందర్‌రెడ్డి, నాయకులు జానకిరాములు, వెంకటేష్, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి, కల్తీకల్లును నిర్మూలిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందాం!

-మాదక ద్రవ్యాల నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 03 ప్రభాతవార్త:** గంజాయి, కల్తీ కల్లును నిర్మూలించి సమాజాన్ని కాపాడుకుందామని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్టీసీ బస్టాండ్‌లో డీసీఆర్బీ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి మాదక ద్రవ్యాల నిషేధంపై పోస్టర్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పోస్టర్లను ఆవిష్కరించి తల్లిదండ్రులు మీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, ఏలాంటి చెడు అలవాట్లకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. 14,15,16 సంవత్సరాల వయస్సుగల పిల్లలు గంజాయిలకు అలవాటు పడుతున్నారని, ఇలాంటి కేసులు మా వరకు చాలా వచ్చాయని, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి మీ యొక్క పిల్లలు ఎలాంటి చెడు అలవాట్లకు గురి కాకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్ర మంలో డీసీఆర్బీ డీఎస్పీ సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్య, డీసీఆర్బీ సీఐ ఉపేందర్, ఎస్ఐ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

## 4,21,000 రూపాయలు సీజ్

**గద్వాల ప్రతినిధి మే 3 ప్రభాతవార్త:** లోక్ సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో, సరి హద్దు చెక్ పోస్టులలో పోలీస్ అధికారులు చపడుతున్న వాహన తనిఖీలలో శుక్రవారం 4,21,000/-రూపాయలను పోలీస్ అధికారులు సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసెల్ కమిటీకి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు మండల కేంద్రములో నిర్వహించిన వాహన తనిఖీలో 2,49,000/-రూపాయలు, బల్గెర చెక్ పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీలో 80,000/-రూపాయలు ,మొత్తం 4,21,000/- రైపాయలను ఏలాంటి రశీదు లేని వాటిగా గర్తించి సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిగ్రెసెల్ కమిటీకి పోలీస్ అధికారులు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలో ఎవరైన 50వేల రూపాయల కొద్దీ ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్తే తగిన రశీదులు, పత్రాలు వాటి వివరాలు వెంట తీసుకెళ్ళాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

● జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్, మే 03 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలను తప్పక అమలు చేసి తీరు తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల కేంద్రంలోని కావేరమ్మపేటలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వ హించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీకి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన వెలువరించారని ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. దీంతోపాటు త్వరలోనే గృహలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500ల పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బలపరచాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లాస్మెట్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 03 ప్రభాతవార్త:** ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను క్లాస్మెట్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10/10 జి.పి.ఎ సాధించిన 15 మంది విద్యార్థులకు గాను హాజరైన 8 మంది విద్యార్థులను క్లాస్మెట్ క్లబ్ డివిజన్ మెడల్, ప్రశంస పత్రాలు బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లక్ష్మి నరసింహరావు, శోభన్‌బాబు, డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీధర్, కృష్ణయ్య, సభ్యులు సంపత్‌కుమార్, కిషన్ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## హజ్ యాత్రికులకు టీకాలు



జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఫర్మీద్ అహ్మెద్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 03 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న భక్తులకు ఈ నెల 4 నుంచి ఉదయం 10 గంటల వరకు నాగర్‌కర్నూల్‌లోని రూబీ గార్డెన్‌లో టీకా శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు షేక్ ఫర్మీద్ అహ్మెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మహబూబ్‌నగర్‌కు చెందిన జామియా నిజామియాకు చెందిన అలీమ్ ముఫ్తి మొహమ్మద్ మౌలానా హఫీజ్ ఫైజుద్దిన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. అదే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌సుధాకర్‌లాల్ టీకా శిబిరాన్ని పర్యవేక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన హజ్ యాత్రికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మార్పించిన చైర్మన్

### కృతజ్ఞతలు తెలిపిన 41వ వార్డు, షాషాబ్‌గుట్ట



ట్రాన్స్‌ఫార్మర్ మార్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్, మే 03 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని షాషాబ్‌గుట్టలో గురువారం అర్ధరాత్రి 3 గం.లకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. విషయం మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌కు తెలియడంతో వెంటనే మరమ్మతులు చేయించారు. వేసవి కాలం సమయంలో ఇబ్బందులు అవుతాయని దృష్టిలో పెట్టుకొని, వెంటనే ట్రాన్స్ ఫార్మర్‌ను మార్పించడంతో వార్డు ప్రజలు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ ఇబ్బంది ఉన్నా తనదృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తాగునీటికిఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ అజ్జాద్ ఉన్నారు.

## క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, షూ అందజేత



**మక్తల్, మే 03 ప్రభాతవార్త :** పట్టణంలో లక్ష్య స్పోర్ట్స్ క్లబ్ విద్యార్థులకు బికెఆర్ ఫౌండేషన్ తరపున 40 మంది విద్యార్థులకు షూ, స్పోర్ట్స్ డ్రస్సులను అందించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని బాల్యంలోని విద్యార్థులను ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో మంచి క్రీడాకారులుగా తయారై భవిష్యత్తులో మక్తల్‌కు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని బికెఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణరెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి జి. లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పసుల రంజిత్‌రెడ్డి, చందాపూర్ రాములు, ఉమర్‌బిన్ శాలం, క్రీడా ఉపాధ్యాయులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



**మల్దకల్ మే 3 ప్రభాతవార్త:** మల్దకల్ మండలం మల్దకల్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వం కల్పించిన ఫుట్బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఈటి, (కోచ్) లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీయడానికి అలాగే క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, కృషి క్రీడల్లో ఎంత అవసరమని. కోచ్‌లు నేర్పేమెలకువలను నేర్చుకొనిక్రీడల్లో గ్రామీలు స్థాయినుంచి రాష్ట్ర,జాతీయస్థాయిలలో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ ఫుట్బాల్ క్రీడా శిక్షణ శిబిరం ఉదయం 5:30 నుంచి 7:30 వరకు సాయంత్రం 5:30నుంచి7:00 వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని పిల్లల ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పిఈటిలు, ఫుట్బాల్ గ్రౌండ్ మర్నింగ్ వాకర్స్, సీనియర్ క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

## వేసవిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహ శ్రీధర్‌రెడ్డి

**ఇటిక్యాల మే 3 ప్రభాతవార్త:** వేసవికాలం కావడం సౌకర్యం ఎండలు తీవ్రత ఉండటంతో తాగునీటి సౌకర్యం. విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులు చూసుకోవాలని ఎంపీపీ స్నేహ శ్రీధర్ రెడ్డి. జెడ్పిటిసి హనుమంత్‌రెడ్డి అధికారులకు చూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో సర్వసభ సమావేశం కొనసాగింది. ఈ సభకు ఎంపీపీ శ్రీస్నేహ శ్రీధర్ రెడ్డి. జెడ్పిటిసి హనుమంత్ రెడ్డి. సింగల్ విండో చైర్మన్ రంగారెడ్డి. హాజరయ్యారు. సందర్భంగా ఆయా శాఖల నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్. ఎంపీఓ భాస్కర్ యాదవ్. ఎంపీటీసీలు లతా చంద్ర గౌడ్, వెంకటేశ్వరమ్మ, తిరుపతి రెడ్డి, లూథర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

**● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే03 ప్రభాతవార్త:** జిల్లాలోని రైతులకు అవసరమైన ఎరువుల కొరత రానివ్వకుండా డీలర్లు, దుకాణదారులు తమ వద్ద ఎరువుల స్టాకును అందుబాటులో ఉంచాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రానున్న వర్షకాలానికి జిల్లాలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా దుకాణదారులు డీలర్లతో జిల్లా స్థాయి ఎరువుల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న వర్షకాలానికి రైతులకు ఎరువుల కొరత రాకుండా జిల్లా స్థాయి ఎరువుల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. 2024-25 సంవత్సరానికి లక్ష ముప్పై వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. సంవత్సరంలో రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించాల్సిన ఎరువులు, పీఓసీ మెషీన్ల ద్వారానే విక్రయించాలన్నారు. జిల్లాలో 450 ఎరువుల దుకాణాలు నియమాలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. ఆదేశాలు పాటించని డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని, ఏఓలు వారికి నిర్దేశించిన 240 ఎరువుల నమూనాలు తీసి ఎరువుల నాణ్యత పరీక్ష కొరకు హైదరాబాద్‌కు పంపాలని తెలిపారు. జిల్లాలోని ఏడీఎలు, ఏఓలు ఎరువులకు సంబంధించిన కార్యక్రమాలు ఎటువంటి ఆలస్యం చేయకూడదని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా కార్యాలయ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారి, ఎరువుల కంపెనీల మార్కెటింగ్ అధికారులు, జిల్లాలోని ఎరువుల హోల్‌సెల్ డీలర్లు తదితరులు ఉన్నారు.

## మహిళా సంఘాలకు భవనాలు లేకపోతే అది నాకే అవమానం

**● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 03 ప్రభాతవార్త:** మహిళా సంఘాల సభ్యులు ఎక్కడో చెట్లకింద కూర్చుని మీటింగ్‌లు పెట్టుకుంటే అది నాకు అవమానమని, అందుకే ప్రతి మహిళా సంఘానికి భవనాలు నిర్మించి ఇచ్చే బాధ్యత నాదే అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్‌లో ఐఎన్‌టియుసి రాములు యాదవ్, 35వ వార్డు కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కులమతాలకతీతంగా మహబూబ్‌నగర్ జిల్లాను మనం అభివృద్ధి చేసుకునే అవకాశం 70సంవత్సరాల తర్వాత మనకు ఆ భగవంతుడు ఇచ్చాడని రేవంత్‌రెడ్డి రూపంలో మనకు ఆ అవకాశాన్ని మనం వినియోగించుకోవాలని, రేవంత్‌రెడ్డి ఇప్పుడు మనపార్లమెంట్ నియోజకవర్గానికి ఇంఛార్జిగా ఉన్నారు. కాబట్టి ఆయనకు బాసటగా నిలిచి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేష వంశీచంద్‌రెడ్డి, ఐఎన్‌టియుసి రాములు యాదవ్, జాజిమొగ్గ నర్సింహులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, బుద్దారం సుధాకర్‌రెడ్డి, విజయ్, చక్రవర్తి పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి మూలస్తంభం పాత్రికేయ వృత్తి

**వాల్మీకి నేత కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు**



**వనపర్తి ప్రతినిధి మే 3 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యానికి మూలస్తంభం పాత్రికేయ వృత్తి అని వాల్మీకి నేత కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు అన్నారు. ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి ప్రపంచంలో జరుగుతున్న ఎన్నో గోరాలను నేరాలను తూర్పు తెల్లవారకముందే నిజాన్ని నిర్భయంగా నిస్వార్థంగా స్వేచ్ఛగా ప్రజల ముందుకు తమ గళంతో కలం పట్టి నిజాలను వెలుగులోకి తీసుకుస్తున్న పాత్రికేయ మిత్రులందరికి ప్రపంచపత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా సాయా జికంగా తదితర అన్ని వర్గాల ఆశయాలను సమాన్వయం చేస్తూ సమాజ శ్రేయస్సు కోరుకునే పాత్రికేయ మిత్రులందరికీ ప్రపంచ దినోత్సవం శుభా కాంక్షలు తెలిపారు. పత్రికా స్వేచ్ఛ దినోత్సవం గురించి 1991లో మొద టి సారి యునెస్కో సామావేశంలో ప్రతిపాదన రాగా 1993లో ఐక్యరాజ్యసమితి పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని మే 3 న జరపాలని నిర్ణయించిందని ఆయన తెలిపారు. అలా ప్రతి సంవత్సరం మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం జరుపుకుంటున్నా మని ఆయన గుర్తు చేశారు. ప్రపంచ స్థాయిలో మీడియా పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఈ దినోత్స వాన్ని జరుపుకుంటారని అన్నారు. పత్రికా స్వేచ్ఛ పట్ల నిబద్ధతను గౌరవించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు గుర్తు చేస్తోందన్నారు. పత్రికా స్వేచ్ఛపై చర్చ జరగడానికి, అలాగే జర్నలిస్టులు ఎదుర్కొనే ఇబ్బందులు ప్రపంచానికి తెలియజేయడానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. అదే విధంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు శుక్రవారం నివాళు లర్పిస్తారని తెలిపారు. ప్రపంచ పత్రిక దినోత్సవాన్ని జరుపుకోవడానికి ముఖ్య కారణం ఆఫ్రికా జర్నలిస్టులే అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో పత్రికా స్వేచ్ఛ పాత్ర, జర్నలిస్టులకు పాత్ర చాలా గొప్పదని ఆయన అన్నారు.

## పదో తరగతి విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, మే 03 ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాల్లో పాఠశాల మొదటి ర్యాంకుసాధించిన సురేఖను ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం మండలంలోని మంతన్‌గోడ్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సురేఖ తండ్రి పెద్ద కుర్మయ్య తల్లి జయమ్మ దంపతులకు జన్మించిన సురేఖ 2024 పదవ తరగతి ఫలితల్లో 10 కి 9.2 గ్రేడ్ సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన మంచి ప్రతిభ కనబరిచిన సురేఖను మంతన్‌గోడ్ ధర్మసమాజ్ పార్టీ గ్రామ కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సన్మానించారు. కార్యక్రమంలో ఫిజిక ల్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ సురేఖ కుటుంబ సమస్యలు ఉన్న ప్పటికి చదువుకు సమస్యలు అడ్డుకావని కష్టపడి చదివి మంచి ఫలితాన్ని సాధిం చింది. మిగతా విద్యార్థులు కూడా కష్టపడి చదవాలని చెప్పారు. మండల నాయ కుడు మూర్తి మహరాజ్ మాట్లాడుతూ సురేఖకు అభినందనలు తెలియజేస్తూ సురేఖ మట్టిలో మాణిక్యం అని ఆమె ఉన్నత చదువులకు సహాయ సహకారాలు ధర్మసమాజ్ పార్టీ తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. ధర్మ సమాజ్ పార్టీ గ్రామ అధ్యక్షులు గువ్వల శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితా లను సాధించడానికి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో ఉందని కొనియాడారు.

## ఉపాధి కూలీలకు 600 వేతనం చెల్లించాలి

**ఆత్మకూరు మే 3 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు 600 రూపాయలు ప్రతి రోజు వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు ఈ మేరకు ఆయన శుక్రవారం రోజు ఆత్మకూరు మండలంలోని కత్తెపల్లి ఆరేపల్లి తదితర గ్రామాలలో ఉపాధి పనులు నిర్వహిసునతన్న కూలీల వద్దకు వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం మూలంగా కూలీలు తీవ్రెక్కట్లో గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్రలు పండుతోందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు ప్రస్తుత సీజన్ కు సంబంధించి ఎనిమిది వారాల పని దినాలు పూర్తి అయినప్పటికి కూలీలకు మాత్రం ఆరు వారాల వేతనాలు మాత్రమే చెల్లించాలని మిగతా రెండు వారాలకు సంబంధించిన వేతనాలు తక్షణమే చెల్లించి కూలీలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రాంతాలలో కనీస సౌకర్యాలైన మంచినీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు 2024 ,25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా జాతీయ పాధి హామీ పథకాన్ని విస్తరింపజేసి పని దినాలను పెంచాలని లేనిపక్షంలో తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టనున్నట్లుగా కూలీలకు హెచ్చరించారు.



## కాంగ్రెస్ యువజన రాష్ట్ర అధ్యక్షుడు కొత్త కాపు శివసేన రెడ్డికి ఘన సన్మానం



**వనపర్తి ప్రతినిధి మే 3 ప్రభాతవార్త :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కాంగ్రెస్ యువజన రాష్ట్ర అధ్యక్షుడు కొత్త కాపు శివసేన రెడ్డిని ఐక్యవేదిక అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాసులు గౌడ్, మాజీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ ప్రసాద్, కౌన్సిలర్ బ్రహ్మం, నాయకులు ప్రకాష్, హరీష్ లు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. శివసేన రెడ్డికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి తర్వాత మొదటి సారి కలిసిన ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శివసేనారెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా నుండి రాష్ట్రంలో అత్యధిక పదవులు పొందిన నాయకులచే వనపర్తికి మంచి పేరు వచ్చిందని. అలాగే తమ పదవులు ఉపయోగించి వనపర్తిని అభివృద్ధి పథంలో నిలపాలని, ప్రజలకు సేవ చేయాలని ఈ సందర్భంగా సతీష్ యాదవ్ కోరారు. శివసేనరెడ్డిమాట్లాడుతూ వనపర్తిజిల్లాలో యువతకు, విద్యార్థులకు, క్రీడలకుతమ వంతుసహాయంగాఉంటానని ఆయన తెలిపారు.

## శ్రీతిమ్మప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**మల్దకల్ మే3 ప్రభతవార్త :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి భారత్ ప్రసాద్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శేష వస్త్రంతో పట్వారిఅరవిందరావు అర్చకులు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శివారెడ్డి, రామాంజనేయులుదామనాగరాజు, వెంకటేష్‌కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం

**ఆత్మకూరు మే 3 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి గ్రామ అంబేద్కర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా అధ్యక్షులు నాగన్న విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలోని అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్యపల్లి గ్రామనూతన కార్యవర్గాన్ని అధ్యక్షులుగా బి దావీదు ఉపాధ్యక్షులుగా వెంకట్రాములు ప్రధాన కార్యదర్శిగా డి గోవిందు సహాయ కార్యదర్శిలుగా బలరాం నాగన్న కోశాధికారిగా నాగరాజు ప్రచార కార్యదర్శులుగా రాజు తిప్పగడ్డ లక్ష్మన్న ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నిరంజన్ విష్ణు, గుడిసె అంజి, భాస్కర్, శేఖర్ తదితరులను ఎన్నుకున్నట్లుగా ఆయన తెలిపారు.

## కల్వకుర్తి బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్‌గా మాయని రాజశేఖర్ నియామకం



బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్‌గా ఎన్నికైన మాయని రాజశేఖర్‌ను అభినందిస్తున్న తల్లోజు ఆచారి

**కల్వకుర్తిరూరల్, మే03 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన మాయని రాజశేఖర్ బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. గతంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించడం పట్ల రాజశేఖర్‌ను అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా మాయని రాజశేఖర్ మాట్లాడుతూ అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియామకానికి సహఖరించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి, రాష్ట్ర బీజేపీ మీడియా కన్వీనర్ అభిలాష్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు పేరుపేరు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం పార్టీ కోసం పనిచేస్తానన్నారు. బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్‌గా ఎన్నికైన మాయని రాజశేఖర్‌ను తల్లోజు ఆచారితో పాటు పలువురు అభినందించారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ



వాసవిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర, మే03 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. దేవాలయంలో 9వటీం కల్వల లక్ష్మిఆంజనేయులు సభ్యులు సూరంపల్లి శ్రీదేవి, ఆంనేయులు, గుద్దేటి హేమలత, నాగేశం, కల్పన, సూరంపల్లి లక్ష్మి నారాయణ, రాధ, బాలస్వామి, గాలఅలివేలమ్మ, మక్కా వెంకటేశ్‌ల అధ్వర్యంలో అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితరకార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.2352 ధర పలికిన సోన

**దేవరకద్ర, మే03 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు 498 కింటాళ్ళ సోన(ఆర్‌ఎన్‌ఆర్) ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2352 ధర పలికింది. అతి తక్కువగా రూ.2009 ధర పలికింది. అలాగే 7 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి కింటాల్‌కు అత్యధికంగా రూ.5423 ధర పలికంది. అలాగే అతితక్కువగా కూడ పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన జీకేఆర్ ఫౌండేషన్



మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం అందజేస్తున్న కోన రాజశేఖర్

**దేవరకద్ర, మే03 ప్రభాతవార్త:** ఓ నిరుపేద కుటుంబానికి జీకేఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆ కుటుంబానికి తన వంతు సహాయంగా శుక్రవారం రూ.5వేలను అందజేసింది. దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామానికి చెందిన హరిజన్ రాజమ్మ అనారోగ్యం కారణంగా మరణించింది. ఈ విషయం తెలుసుకొన్న జీకేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కోన రాజశేఖర్ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి ఆదేశానుసారం మృతురాలి దహన సాంస్కారాల నిమిత్తం రూ.5వేలను మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఓబిసి మండల అధ్యక్షుడు గోపాల్, యవజన నాయకుడు భరత్, కుమార్, గద్మలి రాజేందర్, తునకల బాలయ్య, జగన్‌రెడ్డి, నవీన్, రామచంద్రి, శంకరయ్య, ఒన్నడి రాజు, అమీర్‌పాష, రాఘవులు, జెట్టి గోపాల్ తదితర గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ కూలీలకు పని దినాలు కల్పించాలి

**-పర్యవేక్షించిన పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్**

**వెల్దండ, మే 03 ప్రభాతవార్త:** జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచి వారికి సరైన వసతులను కల్పించాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎస్‌పీఎం కృష్ణమూర్తిలు అన్నారు. మండల పరిధిలోని కుప్పండ్ల గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు వన నర్సరీ, డంపింగ్ యార్డ్ షెడ్‌ను పరిశీలించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ హరితహారంలో భాగంగా గ్రామ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను హరితహారానికి సిద్ధం చేయాలని, ఎక్కడైతే ఎండిపోయిన మొక్కలు ఉంటాయో వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి నీరందించి బ్రతికించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డ్‌లను చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్

# రాహుల్‌గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది

**బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదు**
**రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి జన జాతర సభను విజయవంతం చేయాలి**
**ఎర్రవల్లిలో బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఇటిక్యాల, మే 03 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం ఎర్రవల్లి చౌరస్తాలో జరిగే కాంగ్రెస్ పార్టీ జనజాతర బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ హాజరు కానున్నారని ఈ సభకు లక్షమంది దాకా హాజరై సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈనెల 5వ తేదీన ఎన్నికల ప్రచార జన జాతర సభ ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహిస్తుండగా శుక్రవారం జూపల్లి కృష్ణారావు, గద్వాల జడ్పీ ఛైర్మన్ సరిత తిరుపతయ్య, వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డి, గద్వాలజిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ బహిరంగ సభ స్థలాన్ని సభా వేదికను పరిశీలించి కొనసాగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. జన జాతర బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాహుల్‌గాంధీ హాజరు కానున్నారని పకడ్బందీగా ఇబ్బందులు లేకుండా సభ ఏర్పాట్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీ నరెంద్రమోడీ పాలనలో దేశ ప్రజలకు చేసిందేమీ లేదని మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుందని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. కానీ కాంగ్రెస్


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రభుత్వంలో దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి జరిగిందని పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అంతేకాక ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం సాయంత్రం జరిగే కాంగ్రెస్ జనజాతర సభను విజయవంతం చేయాలని ఆ దిశగా ముఖ్య నాయకులు కార్యకర్తలు బాధ్యతగా తీసుకొని పని చేయాలని సూచించారు. అంతేకాక జనజాతర బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువనేత రాహుల్‌గాంధీ హాజరు కానుండడంతో బహిరంగ సభ స్థలాన్ని జిల్లా ఎస్పీ రితిరాజ్ పరిశీలించారు. బహిరంగ సభ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్పర్సన్ సరిత, వనపర్తి ఎమ్మెల్యే మెఘారెడ్డి, గద్వాల మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుదీపక్‌ప్రజ్ఞ, స్థానికమండల నాయకులు జోగులరవి, లక్ష్మి నారాయణరెడ్డి, వెంకటేష్ యాదవ్, రుక్మానందరెడ్డి, నీలి శ్రీనివాసులు, మెడికల్ మద్దిలేటి, శ్యామ్‌రావు, బజారన్న, జిల్లా అడిషనల్ ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సిఐ రవిబాబు, ఎస్సై వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రితిరాజ్

## మామిడి తోట దగ్ధం


మామిడి తోటలో చెట్లు దగ్ధమవుతున్న దృశ్యాన్ని చూపిస్తున్న రైతు

**ఆత్మకూరు మే3 ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని వీరరాఘవపురం గ్రామానికి చెందిన దబ్బా రాములు మండల జగదీశ్వర్ రెడ్డి రైతులకు చెందిన మామిడి తోటలో 70 చెట్లు దగ్ధం కావడంతో ఐదు లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు. బాధిత రైతులు వ్యవసాయ పొలం పక్కనే గ్రామ ఉపసర్పంచ్ నరేష్ వ్యవసాయ పొలంలో రెండు గడ్డివాములు దగ్గమైన వెంటనే మంటలు విస్తరించి ఇరువురికి చెందిన మామిడి తోటల్లో 70 చెట్లు కాలి బూడిదైపోయాయని రైతులు వాపోయారు ఇరువురి రైతులతో పాటుగా నరేష్ ఉపసర్పంచ్‌కు చెందిన రెండుగడ్డివాములు దగ్ధం అయిన సంఘటనలో దాదాపు లక్ష రైపాయలు ఆస్తి నష్టం సంభవించిందని శుక్రవారం రోజు ఆత్మకూరు లో విలేకరులతో వాపోయారు ఈ మేరకు గ్రామానికి చెందిన అనుమానురితిపై ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లుగా వారు తెలిపారు.

## 78వ రోజు కొనసాగుతున్న దీక్ష

**రేవల్లి మే 3 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని బండరావిపాకుల గ్రామం శ్రీఎదుల వీరాంజనేయ ప్రాజెక్టులో బండరావిపాకుల, కొంకలపల్లి 2015 లో ముంపునకు గురయింది.కొందరికి పునరావసం డబ్బులురాలేదు.ముగ్గురికి సంవత్సరాలుగడుస్తున్నా పరిహారం అందలేదు. 78 రోజుల నుంచి దీక్ష చేస్తున్న అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని అధికారుల తీరుకు నరసనగా బాధితులు దీక్ష 78 రోజుకు చేరింది.స్పందించడం లేదని వ్యక్తం చేస్తున్నారు. దీక్ష చేస్తూ వారి నిరసనను తెలియజేశారు.అధికారులు స్పందించే వరకు దీక్ష విరమించమని అన్నారు.నెలలు గడుస్తున్నా మాకు పురావసం డబ్బులు ,కొత్త గ్రామంలో ఇండ్ల స్థలాలు ఇవ్వడంలేదని పాత గ్రామంలో దొంగల బెడద ఉందని మాకు భద్రత కల్పించాలని వారు కోరారు. అధికారులు స్పందించే వరకు దీక్ష విరమించేది లేదని అవసరమైతే దేనికైనా ముందుకు పోతానని సుకుమార్‌రెడ్డి అన్నారు.ఒక టోకెన్ నెంబర్ ఇచ్చారు.కానీ ఎలాంటి నష్టపరిహారం నగదును ఖాతాలో జమ్మ చేయలేదని అన్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు.

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రాచూర్ విద్యార్థిని


అనం ఫాతిమాను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

**వెల్దండ, మే 03 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందినఅనం ఫాతిమా హైదరాబాద్ బడంగ్‌పేట్‌లోని న్యూ మాస్టర్ మైండ్ కళాశాలలో ఎంఈసీ గ్రూప్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకుల బృందం తల్లిదండ్రులు ఎండి.ఫయాజ్, అస్మాలను అభినందించడంతో పాటు అనం ఫాతిమాను శాలువాలతో సన్మానించి అభినందించారు. చదువు ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అధ్యాపకబృందం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్తులతో పాటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జెడ్పి చైర్ పర్సన్‌ను కలిసిన అఖిలభారత ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు



**గద్వాల ప్రతినిధి మే 3 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పి చైర్‌పర్సన్,కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి సరిత తిరుపతయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు అచలభారత ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజు,శ్రీనివాస్ యాదవ్,మహ్మద్ చాంద్,కృష్ణ గౌడ్,మాల మహానాడు శ్రీనివాసులు కలిశారు.అంతకుముందు పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన మల్లు రవికి మద్దతుగా విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బి.ఎస్ కేశవ్ తో కలిసి అచలభారత ఎస్సీ,ఎస్టీ,బిసి ,మైనారిటీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ ప్రజలను బిజెపి,బిఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంక్‌గా వాడుకుంటుందే తప్ప అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేయలేదని,బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రములో ఏ విధంగా అధికారంలోకి తెచ్చుకున్నామో ,కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నెందుకు గాను పార్లమెంటు అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బిజెపి కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చడమే కాకుండా రిజర్వేషన్ లను పూర్తిగా తొలగించి అట్టడుగు వర్గాల ప్రజలకు అందాల్సిన రాజ్యాంగ ఫలితాలను ప్రజలకు అందకుండా చేస్తుందన్నారు.కాబట్టి అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని అదేవిధంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలోకౌన్సిలర్ నరహరీ గౌడ్,నాగేంద్ర యాదవ్, తిమ్మోతి,జమ్మిచేడు ఆనంద్,అమరవాయికృష్ణారెడ్డి,అల్వాల రాజశేఖరరెడ్డి,హనీఫ్,కరాటే సత్యం,బాబు, రాఘవేంద్ర, సత్యం, రవీందర్‌రెడ్డి, జమ్మన్న తదితరులు ఉన్నారు.

## హెలిపాడు బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ఇటిక్యాల మే 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ ఈ నెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో జరిగే జన జాతర బహిరంగ సభ



సందర్భంగా సభాస్థలి హెలిపాడ్ ప్రదేశాలను జిల్లా ఎస్పీ రితిరాజ్ పరిశీలించారు.పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీ ఎర్రవల్లి చౌరస్తా లో ఆదివారం జరుగు భారీ బహిరంగ సభకు రానున్న సందర్భంగా శుక్రవారం హెలిప్యాడ్,విఐపి పార్కింగ్,ట్రాఫిక్ రూట్లు సభా స్థలికి వచ్చి వెళ్లే దారులు,జనరల్ పార్కింగ్ ప్రదేశాలను జిల్లా ఎస్పీ రితిరాజ్,పరిశీలించారు.ఆనంతరం బందోబస్తు పరంగా చేయవలసిన ఏర్పాట్ల గురించి అధికారులకు పలు బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య,డిఎస్పీ సత్యనారాయణ,సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్,అలంపూర్ సిఐ రవి బాబు,అర్ ఐ వెంకటేశ్,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బిసిలను విస్మరించిన బిజెపి

**బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌సాగర్**



**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 03 ప్రభాతవార్త:** బిసిలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని అదేవిధంగా బిసిలను నమ్మించి మోసం చేసి విభజించి పాలించాలని చూస్తున్న పాలమూరు బిజెపి అభ్యర్థి డికె అరుణను ఓడిస్తామని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌సాగర్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల బరిలో దాదాపు పది నుంచి పదిహేను మంది బిసిబిడ్డలు పోటీలో ఉండడం నిజంగా బిసిలకు గర్వకారణం అన్నా రు.గత కొన్ని రోజులుగా మేము కల్పించిన బిసి అవగాహనలో భాగంగా బిసి బిడ్డలు బరిలో నిలిచి ఈరోజు సగర్వంగా పోటీలో నిలిచారన్నారు. మూడు ప్రధాన పార్టీలు బిసిల పట్ల చూపెడుతున్న కపట ప్రేమను బిసి సమాజం మొత్తం గమనిస్తుందని, ఎన్నికల్లో తమ ప్రతాపం చూపెట్టేందుకు సిద్దంగా ఉన్నామని శ్రీనివాస్‌సాగర్ అన్నారు. గద్వాలలో బిసి అభ్యర్థి గెలిస్తే తమ ఉనికికే ప్రమాదంఅని భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గంలో బిసిల ఆధి పత్యం ఉంటుందని గ్రహించి పార్టీలు వేరైనా టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ కీలక పాత్ర పోషించారనేది నియోజకవర్గ వ్యాప్తంగా చర్చించుకున్న మాట వాస్తవమన్నారు. సరైన సమయంలో సరైన తీర్పు ఇచ్చేందుకు మహబూబ్‌నగర్ బిసి ప్రజలు ఎదురుచూస్తున్నారని శ్రీనివాస్‌సాగర్ అన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్



**బిజినేపల్లి, మే 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్యశాఖ డైరెక్టర్ డా. రవిందర్ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలో భాగంగా ఇక్కడ అమలవుతున్న పథకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ రోగులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.కె. సుధాకర్ లాల్‌తో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో ఆయుష్ ఆసుపత్రిని తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణను పరిశీలించి పచ్చదనం ఉండేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో అందుతున్న అంతర్గత రోగుల వార్డును పరిశీలించి, సేవల రికార్డులను పరిశీలించారు. టీహబ్ ద్వారా రోగులకు అందుతున్న రక్త పరీక్షల వివరాలను ల్యాబ్‌లో పరిశీలించారు.ప్రతి గర్భిణీ 100 శాతం ఆసుపత్రిలోనే ప్రసవించే విధంగా చూడాలని సూచించారు.కాలానుగుణంగా వేసవి తాపాన్ని తట్టుకొనుటకు వచ్చిన రోగులకుఆరోగ్య సేవలతో పాటు ఆరోగ్య విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఎం. వెంకటదాస్,జిల్లా టీకాల అధికారి డా. కె.రవికుమార్ నాయక్, ప్రోగ్రాం అధికారి డా. జి.సాయినాథ్‌రెడ్డి, వైద్యాధికారి డా. ఎం. శివకుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం

**-ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి**


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

**వెల్దండ, మే 03 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే వ్యూహాలపై చర్చించారు. నియోజకవర్గంలో గ్రామాల వారిగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ్మ ముదిరాజ్, గ్రామస్తులు బచ్చలకూర శ్రీను,ఎండీ అలీ, మైసయ్య, లాలయ్య, యాదయ్య, జంగయ్య,రామచంద్రయ్య,రాజు,కొండలు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**మాగనూరు,మే 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలలో జరిగిన గొడవలలో నేటికి కూడా ఎలాంటి చర్య తీసుకోకపోవడంపై పలు అనమానాలు వ్యక్తమవుతున్నాయని పోలీసుల నిర్లక్ష్యం వల్ల బాధితులకు న్యాయం చేయడంలో భాగంగా అకారణంగా దళితులపై దాడిచేసిన వారిని వెంటనే రిమాండ్ చేయాలని, తీవ్ర గాయాలనాలైన బాధితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఈదాడిని తీవ్రంగా పరిగణించాల్సిన పోలీసులు ఈ దాడిని తీవ్రంగా పరిగణించాల్సింది పోయి నామమాత్రంగా విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయకుండా ఉండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంటనే నిందితులను అరెస్టు చేయాలని, జిల్లా వ్యాప్తంగా వివిధ దళిత సంఘాలతో పాటు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సగరం రమేష్, మహేష్, రాఘవేంద్ర, మధు, శ్రీను, మారుతి, గోపాల్, దేవేందర్, అనిల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## దేశానికి మత రాజకీయాలతో ముప్పు

**◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్**



**వీపనగండ్ల మే 3 ప్రభాతవార్త:** దేశానికి మత రాజకీయాలతో రాబోవు కాలంలో ఉప్పు ఏర్పడుతుందని సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ ప్రజలకు పిలుపునిచ్చారు శుక్రవారం నాడు సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ సమావేశం పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మత రాజ్యం,వద్దు,ప్రజాస్వామ్య హద్దు,బిజెపి బందిఖాన నుండి,దేశాన్ని విముక్తి చేద్దామని పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికలలో బిజెపి దాని మిత్రుపక్షాలను ఓడించాలని వారు పిలుపునివ్వడం జరిగింది. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీకి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు ఇందులో భాగంగానే నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన మల్లు రవికి ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు పదవిలో మోడీ పాలన ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పోకడలు పోతున్నది రాజ్యాంగం మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం,లౌకికి విలువల మీద దాడి చేస్తుందన్నారు. మతం పేరుతో,రాముడు పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తుందన్నారు.ఈ సారి మళ్లీ అధికారుల్లోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, మత రాజ్యాని స్థాపించాలని ప్రయత్నిస్తుందన్నారు.ఎన్నికల్లో మోడీని గద్దె దించడం ద్వారా దేశాన్ని కాపాడుకుందామని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని పోరాటాలకు సిపిఎం అండగాలు ఇస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో దాని మిత్రపక్షాలుగా ఉన్నటువంటి వారిని కూడా ఓటించాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్,మండల కార్యదర్శి బాల్ రెడ్డి,మండల కార్యదర్శి వర్గ సభ్యులు వికృష్ణయ్య,బాలగౌడ్, నాగరాజు,సిహెచ్ వెంకటయ్య,ఆశన్న,ఈశ్వర్,ఖాజా హుస్సేన్,రవి ప్రసాద్,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## గుడి స్థలానికి రక్షణ కల్పించిన అధికారులు

- కొంత కాలంగా వివాదంలో ఉన్న స్థలం
- హర్షం వ్యక్తం గ్రామస్తులు


చుట్టు రక్షణ కంచె వేసిన అధికారులు

**అలంపూర్ మే 03 ప్రభాతవార్త:** రాజోలి మండల పరిధిలోని పచ్చర్ల గ్రామంలో ఉన్న గ్రామ దేవత లక్ష్మమ్మ అవ్వ గుడి స్థలానికి ఎట్టకేలకు అధికారులు స్పందించి శుక్రవారం చర్యలు చేపట్టి గుడి స్థలం చుట్టూ రక్షణ కంచె వేశారు. అయితే గత కొంత కాలంగా గ్రామంలోని కొందరు భూ కబ్జాదారులు గుడి స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. దీంతో గ్రామస్తులు భూ కబ్జాదారుల మధ్య కొంత వివాదం నెలకొంది. సమస్యను గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే అట్టి స్థలంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయబద్ధంగా తగు చర్యలు తీసుకుని గుడి స్థలానికి రక్షణ కల్పించాలని గుడి సొసైటీ సభ్యులు కోరారు. అధికారులు అన్ని విధాలుగా పరిశీలించి అమ్మవారి స్థలానికి రక్షణ కంచె వేసి అక్రమార్కులు చర నుంచి స్థలాన్ని కాపాడినట్లు వారు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా వివాదం చోటు చేసుకున్న ఈ ఆలయ స్థలం అనేక గొడవలకు కారణం అయింది. ఏకంగా గుడి స్థలాన్నే అక్రమంగా ఆక్రమించుకునేందుకు కొంతమంది దుండగుల ప్రయత్నాలు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కానీ వాస్తవాలు గమనించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అస్సలు విషయాలు బయట పడడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అమ్మవారి స్థలం నుండి అక్రమ దారులని తొలగించి కంచె వేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఇందులో ముఖ్యంగా లోకాయుక్త కోర్టు అధికారులు, ఎంపిడిఓ రవీందర్ ఎంపీఓ ఖాజావలి, సెక్రెటరీ జనార్దన్, రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ ఛార్జ్ తీసుకున్న తరువాత ఈ సమస్యను పరిశీలించి అరాచకాలకు పాల్పడుతున్న వారిని హెచ్చరించి గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరగకుండా శాంతి భద్రతలు నెలకొల్పి రెవెన్యూ అధికారులు సహకారంతో వివాదం లేకుండా పరిష్కరించడం అభినందనీయమని లక్ష్మమ్మ అవ్వ సొసైటీ సంఘం వారు ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండల ఎంపీడీవో రవీందర్, సహకారం మరియు గ్రామ పంచాయితీ సెక్రెటరీ జనార్దన్ స్వీయ పరిశీలన ఆధారంగా ఉన్నత అధికారులకు నివేదికలు పంపి సమస్య పరిష్కరించినట్లు సంఘం వారు తెలిపారు. గ్రామంలో ఎటువంటి గొడవలకి అల్లర్లకు తావు లేకుండా అధికారులు సమస్యను సామరస్యంగా మార్గం చూపినట్లు వారు తెలిపారు.

## ప్రధాని మోడీ పాలనలోనే దేశం సుభిక్షం

**-జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి**


మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**వెల్దండ, మే03 ప్రభాతవార్త:** కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, నియోజకవర్గ ఇన్‌చార్జి వై.శేఖర్‌రెడ్డిలతో కలిసి ఆచారి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీకి 400 సీట్లు గెలువడం ఖాయమని, ఇప్పటికే 3 సీట్లు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. బీజేపీ పాలనతో దేశాన్ని ప్రపంచంలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదని, బీజేపీ పాలనలో ప్రజలందరు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, జూలూరి బాలస్వామి, గుద్దటి రామస్వామి, పరమేశ్వర్‌గౌడ్, అందోజు శ్రీనివాసాచారి, మట్ట విష్ణుగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ ఎజెండా ఒక్కటే

**కాంగ్రెస్‌కే మా సంపూర్ణ మద్దతు : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మల్లెపోగు శ్రీనివాస్**



మాట్లాడుతున్న మల్లెపోగు శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 03 ప్రభాతవార్త:** బిజెపి,బిఆర్ఎస్ పార్టీలో ఒక్కటే ఎజెండాను అమలు పరుస్తున్నారని వారి దృత రాష్ట్ర కౌగిలిలో మాదిగలు పడొద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మల్లెపోగు శ్రీనివాస్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య పిలుపు మేరకు దక్షిణ జిల్లాల అధ్యక్షులు మల్లెపోగు శ్రీనివాస్ నేతృత్వంలో పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించారు. మల్లెపోగు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ బిజెపిపార్టీ మాదిగ,మాదిగ ఉపకులాల ప్రజలు 10 సంవత్సరాలుగా నమ్మించి నట్టేట ముంచారని 2014 సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్రమోడీ సంపూర్ణ మద్దతుతో ప్రభుత్వం ఏర్ప డిన 100రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపె ట్టి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన నేటి వరకు ఆ హామీని నెరవేర్చ కుండా మళ్లీ మాదిగల జాతి ప్రజలను మభ్యపెట్టి ఓట్ల కోసం మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పే బిజెపి పార్టీ నేతలు ఎస్సీ వర్గీకరణ సమస్యను ఎలా తీర్చుతారని ఆయన ప్రశ్నించరు. ప్రధాని నరేంద్రమోడీ మన రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా వలసల జిల్లా మాదిగ జాతి బిడ్డలుగా ఎస్సీ వర్గీకరణతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా గురించి మాట నిలబెట్టుకుంటారని ఆశించాం కాని ఎస్సీ వర్గీకరణ సమస్య గురించి మాట్లాడకపోవడంతో ఆంగర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకున్నారే తప్పా మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం ఏనాడు కృషి చేయలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతోనే ఆనాటి నుండి నేటివరకు ఇందిరాగాంధి హయాంలో ప్రభుత్వ భూములను పంచిపెట్టడమే కాకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన భూ పంపిణీ వంటి అభివృద్ధి పథకాలతో మాదిగ జాతులు అభివృద్ధి చెందితే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి వచ్చి లాక్కున్నారని ఆయన ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తే మాదిగల ఎస్సీ వర్గీకరణ కోసం మన గొంతై పార్లమెంటులో వాణిని వినిపిస్తారని అదేవిధంగా మన పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రతి ఎకరాకు సాగునీరందించే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా తెచ్చే సత్తా ఉన్న నాయకుడు వంశీచంద్‌రెడ్డి అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ కమిటి అధ్యక్షులు బోరింగ్ నర్సింహులు మాదిగ, నియోజకవర్గాల ఇంఛార్జిలు రావుల కృష్ణ, కరాటే శ్రీను మాదిగ, జగదీష్ మాదిగ, వెంకటేష్ మాదిగ, కృష్ణ మాదిగ, మైబన్న మాదిగ, అశోక్ మాదిగ, హన్మంతుమాదిగ, జయమ్మ మాదిగ, యాదగిరి మాదిగ, రవి మాదిగ, వరమ్మ మాదగ, భాగ్యమ్మ మాదిగ, ఎల్లప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ చిరంజీవి

## మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

### -ఎఐటియుసి జిల్లా నేత ఆనంద్ చిరంజీవి

**నారాయణఖేడ్ టౌన్, మే 3, ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని ఎఐటియుసి జిల్లానాయకులు ఆనంద్ చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆనంద్ చిరంజీవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని, నెలకు రూ. 26 వేల చెల్లించాలన్నారు. ఈఎస్ఐపిఎఫ్ లేని కార్మికులకూ ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వయసు మీరిన వారిక కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసి నయకులు అశోక్, ప్రేమ్‌కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపిటిసి



కాంగ్రెస్‌లో చేరుతున్న పుల్‌కుర్తి మాజీ ఎంపిటిసి సభ్యులు భూమయ్య

**మనూర్, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని పుల్‌కుర్తి మాజీ ఎంపిటిసి సభ్యులు భూమయ్య అనుచరులతో కలిసి శుక్రవారం కాంగ్రెష్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన భూమయ్యకు మాజీ ఎంపిటిసి సభ్యుల పోతుల సంగారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, లింగప్ప పాటిల్, విజయ్ కుమార్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్నవారికి కండువాలు కప్పుతున్న సురేశ్ శెట్కార్

**నారాయణఖేడ్ టౌన్, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని పిప్రి, ఇబ్రా నాయక్ తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటిసి సభ్యులు చందర్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు నెహ్రూనాయక్, గోపాల్, శివరాం, జైపాల్, వసరం, తులసీరాం, లక్ష్మణ్, హేమ్లా నాయక్, జైపాల్ నాయక్, దేవుసింగ్ నాయక్, భీమ్లా నాయక్, సంగ్రామ్ నాయక్, హరిసింగ్‌నాయక్, కిషన్‌నాయక్ తదితరులకు సురేశ్‌శెట్కార్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

## నర్సరీని పరిశీలించిన సిఆర్‌డి అధికారి



పెద్దగోపులారంలో నర్సరీని పరిశీలిస్తున్న సీఆర్డీడి అధికారి

**మునిపల్లి, మే 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దగోపులారం, బుదేరా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామి పనులను, నర్సరీలను కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి మమత ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ మనీకుమారి, అబుట్స్‌మెంట్ అధికారి బోజిరెడ్డిలో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా అధికారి మమత మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలీలకు తాగునీరు, వైద్య, టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహించిన అధికారులపై చర్యలు తప్ప వని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపిఓ యాదగిరి, ఈసీ స్టీఫెన్ పాల్గొన్నారు.

## 11 ఏళ్ల పోరాట ఫలితంగానే
## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు

### -ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత

**గజ్వేల్, మే 3 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మడుపు భూంరెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ గతంలో ఆర్యవైశ్యులు కడు పేదరికాన్ని అనుభవిస్తున్నట్లు స్పష్టం చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చి విస్మరించడంతో ఆగ్రహించిన ఆర్యవైశ్యులు రాష్ట్రవ్యాప్తంగా ఓటుతో ఆ పార్టీకి తగిన బుద్ది చెప్పినట్లు స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలతో కెసిఆర్ కుటుంబ సభ్యులు ఆగర్భ శ్రీమంతులు కాగా, మధ్య తరగతి ప్రజలు, పేదలు మరింత పేదరికంలో కూరుకుపోయినట్లు చెప్పారు. 11 ఏళ్ళ పోరాటం ఫలితంగానే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కాగా, పట్టుబట్టి మేనిఫెస్టోలో ప్రకటింపజేసి అధికారం చేపట్టిన వెంటనే అమలు చేసినట్లు గుర్తుచేశారు. సిఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి మార్గం ఏర్పడగా, అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలనే లక్ష్యంతో 36 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్ దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సంఘం బాధ్యులు కాచం నవీన్‌గుప్త, సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, మల్యాల భద్రయ్య, తోట బిక్షపతి, సూర ఆంజనేయులు, వెంకటయ్య, హరినాథ్, రంగయ్య, బాలేష్, ఎర్రం శ్రీనివాస్, జగ్గయ్యగారి శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాల్వ సుజాత

# పదేళ్ల కెసిఆర్ పాలనలో అప్పుల పాలైన రాష్ట్రం

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

**రామాయంపేట, మే 3, ప్రభాతవార్త :** పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, దీనికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనాలోచిన నిర్ణయాలు కారణమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విమర్శించారు. రామాయంపేటలో పలు పార్టీలకార్యకర్తలు, నాయకులు, కూరగాయల వ్యాపారస్తులతోపాటు చల్మెడ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు సుమారు 500 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం మెహర్ సాయి ఫంక్షన్ హాల్‌లో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, దేవుని జయరాజు, సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీ చేరికలు జరిగాయి. ఇటీవల వీరు టీఆర్ఎస్ పార్టీకి రాజీనాయలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. అప్పటి నుండి వీరు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే ఆ నలుగురు కౌన్సిలర్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని కాంగ్రెస్ పార్టీలో పలువురిని చేర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ పలు పార్టీల కార్యకర్తలు పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి ఎంతో బలం చేకూరిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలైందని, ఆరు గ్యారెంటీలలో ఐదు అమలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, పల్లె రామచంద్రగౌడ్, వై.రమేష్‌రెడ్డి, బండారి మహేందర్ రెడ్డి, చప్పెట ముత్యంరెడ్డి, బాలమని, పోచమ్మల అశ్విని, చింతల స్వామి, దాకి స్వామి, అల్లాడి వెంకటి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, సుంకోజు దామోదర్, కోనాపురం వెంకటి, రాజు, దోమకొండ యాదగిరి, ఎంపిటీసి నాగులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

## ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చేర్యాల, మే 3, ప్రభాతవార్త :** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ చేర్యాల మండల సమితి ఆధ్వర్యంలో 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేశారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు గూడెపు సుదర్శన్ మాట్లాడుతూ 1959 మే 3న ఢిల్లీ, కాన్పూర్‌లో భరత్ సింగ్, చేగువేర ఆశయం కోసం ఏర్పడిన యువజన సంఘం అఖిల భారత యువజన సమాఖ్య, హక్కుల సాధనకై ఆవిర్భవించి నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి హక్కులను సాధించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని అందుకు యువత మేలుకొని పోరాటాలు నిర్వహించి తమ హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ డివిజన్ నాయకుడు జంగిలి యాదగిరి, పొన్నబోయిన మమత, భీమనపల్లి వరలక్ష్మి, ఏఐవైఎఫ్ మండల నాయకులు తపాసుపల్లి బిక్షపతి, గడ్డి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్, మే 3 ప్రభాతవార్త :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని అణభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా నాయకులు జాగిరి సత్యనారాయణ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జనగామ రాజ్‌కుమార్, సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేష్, పార్టీ అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం'గాలానికి చిక్కిన 'బొమ్మ'.....!

### బిజెపి నుంచి కాంగ్రెస్‌లోకి దూకేందుకు సిద్ధమైన బొమ్మ శ్రీరాంచక్రవర్తి

**హుస్నాబాద్, మే 3,ప్రభాతవార్త :** కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి ఎన్నికలవేళ భారీ షాక్ తగలనుంది. హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా రంగంలో నిలిచి ఓటమి పాలైన బొమ్మ శ్రీరాంచక్రవర్తి తిరిగిపాతగూటికి చేరేందుకు రంగం సిద్దంచేసుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరాల్సి ఉండగా ఈ రోజు కాకుండా రాష్ట్ర రాజధానిలో రేవంత్ రెడ్డి సమక్షంలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గత ఫిబ్రవరిలోనే కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసిన బొమ్మ శ్రీరాంచక్రవర్తి బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ కానున్నాడని ప్రభాతవార్త ముందుగానే ఊహించి కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రరవాణా, బిసి సంక్షేమ శాఖ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మార్పుకోసం అనే నినాదంతో అధికారంలోకి రావడంతో ఈ మార్పు సంభవించనున్నట్లు జరుగుతున్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. మరో రెండు రోజుల్లోనే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో తీర్థం పుచ్చుకోనున్నట్లు వార్తలు వినవిస్తున్నాయి. ఈ దశలో శ్రీరాంచక్రవర్తి సోదరి శ్రీరాం చక్రవర్తి పార్టీ మారడాన్ని అడ్డుకునే ప్రయత్నాలను చేస్తున్నట్లు వినికిడి.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బొమ్మ శ్రీరాంచక్రవర్తి



బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో కాంగ్రెస్ నాయకులు

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**నర్సాపూర్ మే 3 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నర్సాపూర్ పట్టణం, కొడిప్యాక, రెడ్డిపల్లి, సికింద్లాపూర్, చందాపూర్ గ్రామాల నుంచి పెద్దఎత్తున భారీసంఖ్యలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు ఆ పార్టీకి రాజినామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారికి వారు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతిసురేశ్‌నాయక్, నాయకులు శ్రీనివాస్‌గుప్త, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల మల్లేషం, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ వెంకటేశం, ఓబిసి సెల్ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, మైనార్టీ అధ్యక్షుడు అజ్మత్, మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్‌గౌడ్, ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నచెల్మెడ అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే




గ్రాడ్యుయేషన్ డేను జరుపుకుంటున్న దృశ్యం

**మునిపల్లి, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని చిన్న చెల్మెడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేష్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా సిడిపిఓ రేణుకాపాటిల్ మాట్లాడుతూ మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే ప్రపంచానికి పరిచయం చేసేది అంగన్‌వాడి బాధ్యులే అన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకుని 5 సంవత్సరాలు చిన్నారులు పూర్తి చేసుకుంటారన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులను చేర్పించడమే యాన్యువల్ డే అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శైలజ, పంచాయితీ కార్యదర్శి అనిల్, అంగన్‌వాడి టీచర్ మీనాక్షి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటం అందజేత

**సిద్దిపేట రూరల్, మే 3, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్నర్ సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కౌన్సి లర్లు ఘన స్వాగతం పలికి స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్ర పటాన్ని అందజేశారు. అనంతరం సిద్దిపేట మున్సిపల్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాకి బాల్‌లక్ష్మీ అనంద్, ముత్యాల శ్రీదేవిబుచ్చిరెడ్డి, పల్లె బాల్‌రెడ్డి, వహీద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ చిత్రపటాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రుణమాఫీ చేస్తాం..రాజీనామాకు సిద్దంగా ఉండూ

### హరీష్‌రావుకు ఎమ్మెల్యే, మాజీ ఎంపి సూచన

**మనూర్, మే 3, ప్రభాతవార్త:** ఆగస్టు 15లోగా రైతులకు 2 లక్షల రూపాయలను ఏక కాలంలో మాఫీ చేయడం ఖాయమని, మాజీ మంత్రి తన్నీరు హరీషరావు తన రాజీనామా పత్రాన్ని సిద్దంగా ఉంచుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ అన్నారు. మనూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దశాబ్ద కాలంలో నియోజకవర్గంలో బిఆర్ఎస్ చేసినఅభివృద్ధి శూన్యమన్నారు. అవినీతి, భూ దందా, కబ్జాలే బిఆర్ఎస్ చేసిన ఘనత అని మండిపడ్డారు. రాష్ట్రంలో 8 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. బిఆర్ఎస్ చేసిన అప్పుల మూలంగా ఖర్చులు తక్కువ చేసుకుంటూ చేసిన 6 హామీల్లో 5 హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నియోజకవర్గానికి సాగు నీరు అందించేందుకు ఇదిగో అదిగో అంటూ బిఆర్ఎస్ కాలయాపనచేయలేదా అని ప్రశ్నించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో ఇటీవలే పైప్‌లైన్ ద్వార సాగు నీరు అందించే విధంగా ప్రొసీడింగ్ తెచ్చానని ఎమ్మెల్యే సంజీవరెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో అసెంబ్లి ఇంచార్జి శశికళ యాదవరెడ్డి, మాఈజ ఎంపిపి శంకరయ్య స్వామి, మండల పార్టీ అధ్యక్షులు సుభాష్‌రావు, మాజీ జడ్పీటిసి నిరంజజన్, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు దిగంబర్‌రెడ్డి, సిద్దరెడ్డి, దొండిరావు, కర్నె శ్రీనివాస్, రాజు, బ్రహ్మానందరెడ్డి, రామ్ చందర్, విజయ్, మల్లు పాటిల్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్



ఈవిఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తున్న అధికారులు

## స్ట్రాంగ్ రూంకు చేరుకున్న ఈవిఎంలు

**నారాయణఖేడ్ టౌన్, మే 3, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను శుక్రవారం నారాయణఖేడ్‌కు తరలించారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఆర్‌డిఓ, డిఎస్‌పిలు ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్

**జహీరాబాద్, మే 3, ప్రభాతవార్త:** వికాస తరంగిణి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రదీప్ మిశ్రా ప్రారంభించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి గౌరవ అధ్యక్షుడు సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, కార్యదర్శి పి.వెంకటరెడ్డి, కార్యదర్శి చిటికుల శ్రీవాణి, కోశాధికారి బెజుగం సంధ్య, గంజి మంజులత, డాక్టర్ శేషు పద్మనాభం, జి హేమశ్రీ, విశాలాక్షి, పి గోపాల్, పి దత్తరెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీమ హనుమాన్ ఆలయంలో కీర్తన సేవ



సీమ హనుమాన్ ఆలయంలో కీర్తన సేవా కార్యక్రమాల దృశ్యం

**సిర్గాపూర్, మే 3, ప్రభాతవార్త:** మండలంలోని ఉజలంపాడ్ గ్రామంలోని శ్రీ సీమ హనుమాన్ ఆలయంలో శ్రీ అఖండ హరినామ సప్త మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 4వ రోజైన శుక్రవారం కీర్తన సేవా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. శ్రీ బాల కీర్తన కార్ చైతన్య మహారాజ్ కీర్తన సేవా చేశారు. హిందూ సనాతన ధర్మపై మహారాజ్ వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు అవుటి సంజీవులు, గురునాథ్, తుకారం పాటిల్, అనంత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

**చేర్యాల, మే 3, ప్రభాతవార్త :** చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట మండలాలకు చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జనగామ డీసిసి అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో మద్దూరు మండలంలోని సలాక్‌పూర్, గాగిల్లాపూర్, దూల్మిట్ట మండలంలోని బెక్కల్, హనుమతండా, లింగాపూర్ గ్రామాల నుంచేకాకుండా చేర్యాల పట్టణానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నిజాంపేట(ఖేడ్), ఏప్రిల్ 3ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాల్కన్‌చెల్క తండాలో జరిగిన మూడ్ చందర్‌నాయక్ రిసెప్షన్లో మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన మండలంలో జరిగిన ఆయా వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి వెంట కల్హేర్ జడ్పీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దుర్గారెడ్డి, ఎంపీటీసీ కిషన్‌నాయక్, రూప్‌సింగ్, పాండ్యానాయక్, దేవిసింగ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్, బిజెపి కార్యాకర్తలు



కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో నాయకులు

**హత్నూర మే 3, ప్రభాతవార్త:** హత్నూర మండలం చందాపూర్, కోడిపాక, పన్యాల, సికింద్లాపూర్ గ్రామాలకె చెందిన బిఆర్ఎస్, బిజెపికి చెందిన నాయకులు, కార్యాకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. టిపిసిసి ప్రధాన కార్యాదర్శి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలోచేరారని, వారికి కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, పార్టీ పనితీరును నచ్చి ఇతర పార్టీ నాయకులు, కార్యాకర్తలు చేరుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యాక్రమంలో డిసిసి అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, జడ్పీటిసి అంజనేయులు, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు టి.రాజేందర్, మండల అధ్యక్షులు కె.కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కె.వెంకటేశం, దుర్గారెడ్డి, బుచ్చిరెడ్డి, అజీజ్, కె.రాములు, మధుసూదన్‌రెడ్డి, మహేష్, దశరథ పాల్గొన్నారు.

## రాయిలాపూర్ పోచమ్మగుడిలో ఎమ్మెల్యే పూజలు

**రామాయంపేట, మే 3, ప్రభాతవార్త :** మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, ఏసుగారి రమేష్‌రెడ్డితోపాటు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పోచమ్మ దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రావు